క్లుప్తంగా

జవాన్లకు ఘన స్వాగతం



వర్ధన్నపేట : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'లో సెలవుల నేపథ్యంలో స్వగ్రామమైన మండలంలోని ఇల్లందకు చేరుకున్న ఆర్మీలో పని చేస్తున్న జవాన్లు జెల్ల శ్రీనివాస్, సట్ల హరీశ్‌లకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామానికి చెందిన జోగుల రాజు ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్‌లో శ్రీనివాస్, హరీశ్‌లను సోమవారం శాలువాలతో సత్కరించారు. 'జై జవాన్–జై కిసాన్' అంటూ నినాదాలు చేశారు.

కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు రత్నాకర్

దుగ్గొండి : మండలంలోని చాపలబండకు చెందిన స్నేహ పురుషుల పొదుపు సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోకల రత్నాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడుగా రాగం కట్టయ్య, డైరెక్టర్లుగా ఉడుత ఓదెలు, కొంకటి భాస్కర్, మోడెం సుధాకర్, తోకల కరుణాకర్‌రెడ్డి, కాస రాజు, రాగం ఐలయ్య, పోలోజు అశోక్, రాజబోయిన రవి, బొగ్గుల రాజయ్య, సోనబోయిన రాజు ఎన్నికయ్యారు. అనంతరం కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు.

వివాహిత అదృశ్యం



సింధు

సంగెం : వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కుంటపల్లికి చెందిన విజయగిరి నాగరాజు భార్య సింధు సోమవారం ఉదయం అదృశ్యమైంది. నాగరాజు కిరాణా షాపునకు వెళ్లి వచ్చే సరికి సింధు కనిపించలేదు. స్థానికంగా, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా నాగరాజు, సింధు ఆర్నెళ్ల క్రితమే ప్రేమ వివాహం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ప్రొబేషనరీ ఎస్సై అర్చన తెలిపారు. సింధు లైట్ గ్రీన్ టాప్, బ్రౌన్ కలర్ ప్యాంట్ ధరించి ఉందని, 5.7 అడుగుల ఎత్తు ఉంటుందని ఎస్సై మీడియాకు వెల్లడించారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 8712685029, 8712685243 లకు సమాచారం అందించాలని కోరారు.

నలుగురిపై కేసు నమోదు

సంగెం : వేర్వేరు ఘటనల్లో అందిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. మండలంలోని కాట్రపల్లికి చెందిన వంగ సూరయ్యపై దాడి చేయడంతోపాటు ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి ఫర్నీచర్ ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురిచేసిన ఘటనలో గ్రామానికి చెందిన కత్తుల రాజేశ్‌పై కేసు నమోదు చేసినట్టు ప్రొబేషనరీ ఎస్సై అర్చన తెలిపారు. అలాగే గవిచర్లకు చెందిన పెద్దపల్లి రాజేందర్‌పై భూమి గెట్టు వైపు కందకం తీస్తున్నావంటూ బూతులు తిట్టి దాడి చేసిన ఘటనలో పెద్దపల్లి రూపదేవి కుమారస్వామి దంపతులపై, గాంధీనగర్‌కు చెందిన సూదం భారతి శ్రీనివాస్ దంపతులపై దాడి చేసిన ఘటనలో బొడ్డు వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

ముగ్గురిపై..

గీసుకొండ : మండలంలోని మనుగొండలో కళ్లలో కారం చల్లి కత్తి పీటతో దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ మహేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మనుగొండకు చెందిన తుప్పరి కృష్ణస్వామి ఇంటి నిర్మాణం చేపట్టిన నేపథ్యంలో తలుపులు చేయడానికి గ్రామానికి చెందిన తుప్పరి భద్రయ్య ఆదివారం రాత్రి వెళ్లాడు. ఈ క్రమంలో కృష్ణస్వామి బంధువులు తుప్పరి యశ్వంత్, తుప్పరి శ్రీనివాస్, గోకారపు మున్నా భద్రయ్యను నీవెందుకు పని చేస్తున్నావంటూ కళ్లలో కారం చల్లి కత్తిపీటతో దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

మాజీ జెడ్పీటీసీపై ఫిర్యాదు

వర్ధన్నపేట : దుర్భాషలాడుతూ తనపై భౌతిక దాడికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ స్థానిక వర్ధన్నపేట మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణిపై మండల కేంద్రానికి చెందిన ఈరెల్లి శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. ఈనెల 24న స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లోని ఓ ఇంటర్నెట్ సెంటర్ వద్ద తాను నిల్చుని ఉండగా సారంగపాణి వచ్చి తనను ఇష్టారీతిన దూషించాడని, పిడిగుద్దులతో దాడికి పాల్పడ్డాడని, చంపుతానని బెదిరించాడని తెలిపాడు. సారంగపాణి నుంచి తనకు ప్రాణహాని ఉందని చెప్పారు. సారంగపాణిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరాడు.

ఒకరికి గాయాలు

మామునూరు : వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మామునూరు నుంచి వరంగల్ దిశగా వస్తున్న బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా బైక్‌పై ఉన్న వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

● పెరిగిన ధరలతో అన్నదాతపై ఆర్థికభారం

నల్లబెల్లి : మండల రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులోకి వచ్చాయి. మండలానికి 300 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా మొదటి విడతలో భాగంగా శనిగరం రైతు ఆగ్రోస్‌కు శనివారం 30 కిలోల బరువున్న 200 బస్తాలు అందాయి. గతేడాది రూ.1116గా ఉన్న 30 కిలోల జీలుగ విత్తనాల బస్తా ధర ఈ ఏడాది సబ్సిడీ పోగా రూ.2137.50కు పెంచడంతో రైతులపై ఆర్థిక భారం పడుతోంది.

మండల రైతులు కొద్ది రోజులుగా జీలుగ విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. రాబోయే ఖరీఫ్‌లో మండలంలో 6 వేల వేల ఎకరాల్లో వరి సాగు చేయనున్న క్రమంలో సాగు భూమిలో 50 శాతం విస్తీరానికి 300 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అవసరమని వ్యవసాయ వాఖ అధికారులు అంచనా వేశారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. కాగా మొదటి విడతలో భాగంగా మండలానికి 30 కిలోల బరువున్న 200 బస్తాలు అందాయి. మరో 2, 3 రోజుల్లో అదనంగా 834 బస్తాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. విత్తనాలను రైతులకు ఏఈఓల ద్వారా సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

పెరిగిన ధరలతో రైతులపై ఆర్థిక భారం

జీలుగ విత్తనాల ధరలను ప్రభుత్వం పెంచడంతో రైతులపై అదనంగా ఆర్థికభారం పడుతోంది. గతంలో 60 శాతం సబ్సిడీపై ప్రభుత్వం విత్తనాలు పంపిణీ చేయగా.. ప్రస్తుతం సబ్సిడీని 50 శాతానికి తగ్గించింది. అలాగే ధరల పెంపు, సబ్సిడీ తగ్గింపుతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది 30 కిలోల జీలుగ విత్తనాల బస్తా సబ్సిడీపై రూ.1116కు విక్రయించగా, ప్రస్తుతం రూ.2137.50కు అందిస్తున్నారు. ఒక్కో బస్తాపై అదనంగా రూ.1021 చెల్లించాల్సి వస్తుండడంతో రైతుల వేదనకు గురవుతున్నారు.



జీలుగ విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ రజిత, తదితరులు (ఫైల్)

మండలానికి 300 క్వింటాళ్లు అవసరం

మండల రైతులకు 300 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అవసరమని ప్రభుత్వానికి నివేదిక పంపించాము. మొదటి విడతలో భాగంగా 60 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసింది. మిగతా విత్తనాలను ప్రభుత్వం త్వరలో సరఫరా చేస్తుంది. రైతులు పట్టాపాస్ పుస్తకాలతో సంబంధిత ఏఈఓలను సంప్రదించాలి.

– బన్న రజిత, ఏఓ

ధాన్యం దహనం చేసి నిరసన



ధాన్యాన్ని దహనం చేస్తున్న రైతులు

పర్వతగిరి : కొనుగోలులో తీవ్ర జాప్యం చేస్తూ మోసగిస్తున్నారంటూ మండలంలోని బూరుగుమడ్ల గ్రామ రైతులు సోమవారం ధాన్యాన్ని దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. బూరుగుమడ్ల పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కాంటాలు పెట్టడంలో నిర్వాహకులు తీవ్ర జాప్యం చేస్తూ మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సరిపడా బార్దాన్ ఇవ్వడంలో అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని చెప్పారు. మూడు రోజులకు ఒకటి చొప్పున లారీ పెడుతూ ధాన్యాన్ని కాంటా వేస్తున్నారని వాపోయారు. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్న క్రమంలో వర్షం కురిసిన ప్రతిసారి ధాన్యాన్ని ఆరబోయడం చాలా ఇబ్బందిగా ఉందన్నారు. కాలం ముంచుకొచ్చినా కొనుగోలు కేంద్రం వద్ద ఇంకా సుమారు 10 లారీల ధాన్యం నిల్వ ఉందని ఆందోళన వెలిబుచ్చారు. సదరు ధాన్యాన్ని రెండు, మూడు రోజుల్లో మిల్లులకు తరలించకుంటే భారీ నష్టం తప్పదని స్పష్టం చేశారు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోళ్లు మొదలెట్టే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం, తదితరులు

● ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి

పర్వతగిరి : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని స్థానిక మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ (ఎంపీపీఎస్)లో హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. ఆ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుల్లోనే కాకుండా ఆటపాటల్లోనూ రాణించేలా తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. 6 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా నోట్‌బుక్స్ సైతం అందిస్తోందని చెప్పారు. స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య పెరిగే దిశగా ఉపాధ్యాయులు, ప్రజలు సమన్వయంతో చొరవ చూపాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలోనే చేర్పించి విద్యాశాఖ ద్వారా అందుతున్న సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెరిగి మెరుగైన ఫలితాలు సాధించడంతోపాటు ఉత్తమ పౌరులుగా ఎదిగే దిశగా పాటుపడతామని చెప్పారు. తొలుత పాఠశాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో ఏఏపీసీ చైర్‌పర్సన్ నీరటి జ్యోతి, హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు లలితదేవి, రామస్వామి, ప్రసాద్, కిషన్ పాల్గొన్నారు.

వేలాడే యమపాశాలు



నెక్కొండ : మండలంలోని అలంకానిపేటకు చెందిన సముద్రాల అశోక్‌కు చెందిన వ్యవసాయ భూమిపై ఉన్న విద్యుత్ తీగలు యమపాశాలను తలపిస్తున్నాయి. సదరు విద్యుత్ స్తంభాల నడుమ దూరం భారమై అవి చేయి ఎత్తితే తాకే ఎత్తులో వేలాడుతున్నాయి. గాలికి, వానకు వంగిపోవడంతో మేతకు వచ్చే పశువులకు, ఆదమరచి రాకపోకలు సాగించే రైతులకు ప్రాణాపాయం పొంచి ఉంది. ఇటీవల యాసంగి వరి కోత మిషన్‌ను తీసుకురాగా తాత్కాలికంగా కర్రల సాయంతో తీగలను పైకి ఎత్తి ఉంచిన దుస్థితి నెలకొంది. సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతు అశోక్ మీడియా ఎదుట వాపోయాడు. ఇకనైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని తీగలను సరి చేసేలా, స్తంభాల నడుమ మిడిల్ పోల్ వేసేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు నోట్‌బుక్స్

● ఎంఈఓ లింగారెడ్డి

పర్వతగిరి : మండలంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయడం కోసం ప్రభుత్వం నుంచి 15951 నోట్‌బుక్స్‌ను అందినట్టు ఎంఈఓ గాయపు లింగారెడ్డి తెలిపారు. ఈ మేరకు స్థానిక మండల రిసోర్స్ సెంటర్ (ఎంఆర్‌సీ)లో సంబంధిత హెడ్‌మాస్టర్లకు ఆయన సోమవారం విద్యాశాఖ నుంచి అందిన నోట్‌బుక్స్ అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం 6 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న వారితోపాటు ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ అందిస్తోందని తెలిపారు. విద్యార్థులకు సకాలంలో నోట్‌బుక్స్ పంపిణీ చేయాలని హెచ్‌ఎంలకు చెప్పారు. పేద విద్యార్థులకు ఉచితంగా అందుతున్న నోట్‌బుక్స్‌తో లబ్ధి చేకూరాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సీసీఓ గారె జయరాజ్, సీఆర్‌పీలు ప్రవీణ్, సుధ, తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంలకు నోట్‌బుక్స్ అందజేస్తున్న ఎంఈఓ

'గ్రామ ఆరోగ్య రక్ష' సేవలు

వర్ధన్నపేట : మండలంలోని దమ్మన్నపేటలో బన్ను ఆరోగ్య దా సేవా సంస్థ ఆధ్వర్యంలో 'గ్రామ ఆరోగ్య రక్ష' సేవలు సోమవారం ప్రారంభించారు. ఇంటింటికీ వైద్యులు, సిబ్బంది వెళ్లి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మీడియాతో మాట్లాడారు. అమెరికాలో వైద్యరంగంలో స్థిరపడిన దమ్మన్నపేటకు చెందిన డాక్టర్ వీరమల్ల చరణ్‌జిత్‌రెడ్డి స్వగ్రామానికి తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో స్థాపించిన ×బన్ను ఆరోగ్య దా సేవా సంస్థ¥ ద్వారా గ్రామాన్ని దత్తత తీసుకున్నట్లు తెలిపారు. చరణ్‌జిత్‌రెడ్డి తండ్రి సాయిరెడ్డి జ్ఞాపకార్థం ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వైద్యులు గ్రామస్తులకు మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, రక్తహీనత వంటి దీర్ఘకాలిక వ్యాధులపై ఇంటింటికీ వెళ్లి ఉచిత స్క్రీనింగ్, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడంతోపాటు ఆరోగ్య సూచనలు అందించినట్టు చెప్పారు. మూడు నెలలకోసారి అనీమియా, షుగర్, తదితర వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తామన్నారు.



గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పొలాలకు దారి చూపండి



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద శివారులోని ఊర చెరువు పారకం కిందున్న పంట పొలాల్లోకి వెళ్లేందుకు రైతులకు దారి చూపాలని కోరుతూ మాజీ సర్పంచ్ పెంచాల కుమారస్వామి ఆధ్వర్యంలో రైతులు జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణికి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడారు. సర్వే నంబర్ 1511, 1514, 1517, 1518, 1519, 1520ల్లోని సుమారు వంద ఎకరాలకుపైగా ఉన్న పంట పొలాలకు వెళ్లే దారిలేక రైతులు పంటలు పండించడంలో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. నక్షాను అనుసరించి దారి చూపేలా అధికారులను ఆదేశించాలని కోరారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు



బ్రోచర్లు విడుదల చేస్తున్న శాస్త్రవేత్త హరికృష్ణ, తదితరులు

● వ్యవసాయ శాస్త్రవేత్త హరికృష్ణ

దుగ్గొండి : ఏటా పంట మార్పిడి చేసి పలురకాల పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వరంగల్ వ్యవసాయ ప్రాంతీయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) శాస్త్రవేత్త హరికృష్ణ తెలిపారు. మండలంలోని పానకల్‌లో సోమవారం నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పంటల సాగులో యూరియా వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని రైతులకు చెప్పారు. విత్తనాల నాణ్యతను పరిశీలించాకే కొనుగోలు చేయాలని, పంట కాలం ముగిసే వరకు రసీదులను జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని తెలిపారు. వరి తర్వాత యాసంగిలో చిరుధాన్యపు పంటలు సాగు చేయడం మేలన్నారు. తొలకరి వర్షాలకు జనుము, జీలుగు విత్తనాలు చల్లి 45 రోజుల తర్వాత భూమిలోనే కలియదున్నాలని తెలిపారు. తద్వారా భూసారం పెరుగుతుందని వివరించారు. అనంతరం బ్రోచర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు గోపిక, ఏఈఓ విజయ్‌నాయక్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు అరవింద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సును విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్ర బాబు

నల్లబెల్లి : ఈనెల 31న నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సుకు మాదిగ కుల, ఉపకులాల ప్రజలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు పొట్ల నరేంద్ర బాబు కోరారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. పద్మశ్రీ అవార్డు స్వీకరించి అందుకున్న అనంతరం ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ ఢిల్లీ నుంచి నేరుగా వరంగల్‌కు తొలిసారి రానున్నారని చెప్పారు. సదస్సులో కృష్ణ ప్రసంగిస్తారని, భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. సమావేశంలో నాయకులు బిర్రు మహేందర్, కల్లెపల్లి ప్రణయ్ దీప్, తడుగుల విజయ్, రాజశేఖర్, బొట్ల ప్రతాప్, పరికి కోర్నెల్, నాగెల్లి అనిల్, బట్టు సాంబయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి

దుగ్గొండి : మండల కేంద్రంలో మున్నూరుకాపు సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ సత్యసాయి మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గైరాజు మాట్లాడారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణ విషయమై ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎన్నికల్లో గెలిచి ఏళ్లు గడుస్తున్న క్రమంలో త్వరితగతిన నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు శంకేసి మణి, ప్రధాన కార్యదర్శి కూస సుమన్, కోశాధికారి బట్టు బక్కయ్య, సభ్యులు తొగరు ప్రవీణ్, శంకేషి స్వామి, తొగరు రవి, బట్టు నాగరాజు, కామిశెట్టి రవి, తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత విత్తనాల విక్రయం నేరం

● ఎస్సై నరేశ్, ఏఓ యాకయ్య

సంగెం : ప్రభుత్వం నిషేధించిన, నాసిరకం హెచ్‌టీ పత్తి విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు విక్రయించడం చట్టరీత్యా నేరమని ఎస్సై నరేశ్, ఏఓ యాకయ్య స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్లకు సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. డీలర్లందరూ ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యాపారం చేయాలని స్పష్టం చేశారు. డీలర్లు విక్రయించిన వాటికి సంబంధించి రైతులకు బిల్లులు ఇవ్వడాన్ని బాధ్యతగా భావించాలని సూచించారు. గడువు తీరిన విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులను షాపులో నిల్వ ఉంచొద్దన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయంలో సేవా దృక్పథం ఉండాలని ఆకాంక్షించారు. రైతులకు మేలు జరిగేలా ఆశించాలని, మోసం చేసే గుణం ఉండదని తెలిపారు. రైతులను ఏ రకంగా మోసగించినా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యుడు జి.శ్రీనివాస్, కోశాధికారి సురేశ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై నరేశ్

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

దుగ్గొండి : మండల కేంద్రంలోని జాగృతి విద్యాలయంలో 1999–2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి విద్యాభ్యాసం పూర్తి చేసిన విద్యార్థులు సోమవారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్న నాటి మిత్రులను కలుసుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంలో మునిగి తేలారు. ఇబ్బందుల్లో ఉన్న సహచరులను ఆదుకోవాలని తీర్మానించుకున్నారు. అనంతరం నాడు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు రవికుమార్, రంగారావు, రాజిరెడ్డి, రాజయ్య, భిక్షపతి, పూర్వవిద్యార్థులు ప్రసాద్‌కుమార్, మహ్మద్ అక్రమ్, దాసరి రాజు, దద్దణాల రవీందర్, అనిత, సరిత, విజయలత, రజిత, సునిత, కవిత, స్వప్న, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం జీపీ ఎదుట దీక్ష



గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలీకి చెందిన మిట్టపెల్లి అరవింద్ ఆస్తి కోసం గ్రామ పంచాయతీ ఎదుట సోమవారం దీక్ష చేపట్టారు. అరవింద్ తండ్రి శ్రీనివాస్ మృతి చెందగా శ్రీనివాస్‌కు చెందని ఆస్తిని అరవింద్ ఇవ్వాలంటూ పెద్దమనుషులు గతంలో చేసిన తీర్మానాన్ని పెదనాన్న కరుణాకర్, బాబాయి రాజు ఒప్పుకోకుండా అడ్డు తగులుతున్నారు. సదరు ఆస్తి తన నానమ్మ రాజేశ్వరి పేరిట ఉండగా పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో అరవింద్ దీక్ష చేపట్టాడు. తనకు న్యాయం చేయలని అరవింద్ కోరుతున్నాడు.

రైతులకు జీలుగ విత్తనాలపంపిణీ

సంగెం : జీలుగ విత్తనాలు చల్లి 45 రోజుల తర్వాత కలియదున్నితే భూసారం పెరుగుతుందని మండల ఏఓ యాకయ్య తెలిపారు. మండలానికి చెందని పలువురు రైతులకు సోమవారం ఆయన సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందజేసి మాట్లాడారు. మండల రైతుల కోసం ప్రభుత్వం నుంచి 300 క్వింటాళ్ల పచ్చిరొట్ట జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. తీగరాజుపల్లి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ద్వారా 150 క్వింటాళ్లు, కాపుల కనపర్తి సొసైటీలో 100 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన రైతులు కిలోకు రూ.71.25 సబ్సిడీ పోగా రూ.71.20 చొప్పున చెల్లించి తీసుకోవాలని సూచించారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లను స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఇచ్చి ఆన్‌లైన్ పర్మిట్ తీసుకుని జీలుగ విత్తనాలు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.



జీలుగ విత్తనాలు అందజేస్తున్న ఏఓ యాకయ్య

'ఫాదర్ రఫేల్ సేవలు చిరస్మరణీయం'



నివాళులర్పిస్తున్న పావని, తదితరులు

నర్సంపేట : నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని చిన్న అడిశర్లపల్లిలోని సంజీవని కాలేజ్ ఆఫ్ ఎడ్యూకేషన్ (బీఈడీ) కళాశాల కరస్పాండెంట్, సంజీవని ట్రస్ట్ వ్యవస్థాపకుడు, తిమ్మరాయినిపహాడ్‌కు చెందిన ఫాదర్ ఏటుకూరి రఫేల్ సేవలు చిరస్మరణీయమని తిమ్మరాయినిపహాడ్ మాజీ సర్పంచ్ కొండవీటి పావని ప్రదీప్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. రఫేల్ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడని చెప్పారు. పేద విద్యార్థులకు రఫేల్ ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డిమాసు కిశోర్, పునీత రాయప్ప చర్చి పెద్దలు కొండవీటి ప్రదీప్‌కుమార్, పుట్టి భాస్కర్, మల్లవరపు శౌరి రాజు, తదితరులు పాల్గొన్నారు.